క్లుప్తంగా

ఆశాలకు వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం తమకు మార్చి నెల వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి. శాంతమ్మ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదో తేదీ వచ్చినప్పటికీ ఇంతవరకు ఆశాల వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తక్షణం వేతనాలు ఇచ్చి ఆశాలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి సి అమ్ములు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

13న సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 13న విజయవాడలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీల నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. గురువారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మైనారిటీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ మైనారిటీల చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గార్హీ, రాష్ట్ర మైనారిటీల చైర్మన్ శాలి దాదా గాంధీ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ రాష్ట్ర సమావేశానికి కడప జిల్లాలోని మైనారిటీ నేతలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ఊరి బడిని దూరం చేయవద్దు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసి) బలవంతపు తీర్మానాలతో ఊరి బడి ఉసురు తీయవద్దని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి యూటీఎఫ్ తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోగా, ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఐదారు కిలోమీటర్లు ప్రయాణం చేసి చదువుకునే అవకాశం ఉందా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, సి.డి.పి. ప్రత్యూష, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ యువతులకు డిబేట్ పోటీలు

కడప కల్చరల్ : కడప రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 9 గంటలకు డిగ్రీ, పీజీ చదువుతున్న యువతులకు డిబేట్ పోటీలు నిర్వహించనున్నట్లు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుత ఆధునిక యువతకు 'మానవీయ విలువలా, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమా' ఏది ముఖ్యం అనే అంశంపై ఈ పోటీ ఉంటుందన్నారు. కడప నగరం రాజీవ్ మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఈ పోటీ ఉంటుందన్నారు. ఇందులో మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండవ బహుమతి రూ. 7500, మూడవ బహుమతి రూ. 5 వేలు, ప్రోత్సాహక బహుమతిగా రూ. 2500 ఈనెల 15న అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనదలిచిన వారు వాట్సాప్ నెంబరు 90145 90599 లేదా ఈ మెయిల్ రెడ్డి సేవా సమితి కడప అట్ ది రేట్ ఆఫ్ జీమెయిల్ డాట్ కామ్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు.

ఉమ్మడి జిల్లా సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లాకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న సందర్భంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లా ప్రజల చిరకాల కల కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసి, ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే కడపలో ఉండే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేల ఎకరాల్లో వున్న కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లా యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సురేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సుధాకర్

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. వెయిటింగ్‌లో వున్న డీఎస్పీ ఎన్. సుధాకర్‌ను కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన జిల్లాలో ఎస్ఐగా, సీఐగా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా విధులను నిర్వహించారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేట డీఎస్పీగా పనిచేస్తూ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి తాజాగా కడప జిల్లా పోలీసుశాఖ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు.



కల్యాణానికి సర్వం సిద్ధం

ఏకశిలానగరిలో శుక్రవారం కోదండరాముడి కల్యాణానికి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాత్రి సమయంలో ఇక్కడ సీతారాముల కల్యాణం నిర్వహించడం విశేషం.

– ఫొటోలు, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఏపీ పీటీడీ ఎన్ఎంయూఏ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారిని అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. వీటితోపాటు ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనాలని కోరారు. కార్యక్రమంలో కడప రీజియన్ ప్రెసిడెంట్ నాగముని, డిపో కార్యదర్శి శ్రీను, కోశాధికారి టీఎం బాషా, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, మూర్తి, రామచంద్ర, కేవీఎస్ రెడ్డి, సారథి, మున్నా, సీఎస్ రెడ్డి, ఎల్ఎన్ రావు, లక్ష్మి రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీని అమరావతికి తరలించవద్దు



ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్‌సీపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించి రాయలసీమ వాసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రకార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మరియాపురంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ముందు 'అన్నీ అమరావతి కేనా?– ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించవద్దు' అన్న వాల్ పోస్టర్లను ఆవిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాయలసీమలో ఉన్న అనేక సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమను కరువు నేలగా మార్చారని, అక్కడక్కడ ఉన్న అరకొర సంస్థలను కూడా అమరావతికి తరలించి సీమను పూర్తి ఎడారిగా మార్చాలని చూస్తున్నారా? అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరామయ్య ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, తస్లీమ్, ముని రెడ్డి, విజయ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శాఖ విజన్ మిషన్ కలిగి ఉండాలి



డిపార్టుమెంట్ హెడ్‌తో మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : భవిష్యత్తులో మనం ఉన్నతంగా ఉండేందుకు నిర్ణయించుకున్న దీర్ఘకాలిక లక్ష్యాలు (విజన్), ఆ లక్ష్యాల సాధనకు మనము అనుసరించే విధానాలను (మిషన్) ప్రతి శాఖ రూపొందించుకొని వాటిని సాధించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను గురువారం రెండో రోజు కొనసాగించారు. ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ డిపార్ట్‌మెంట్లను సందర్శించారు. ఆయా శాఖల విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి ఉపకులపతి ముందు వివరించారు. ఉపకులపతి వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ ఉన్నారు.

తిరుమలేష్.. నోటిని అదుపులో ఉంచుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ నోటిని అదుపులో ఉంచుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేసే స్థాయి నీకుందా...స్థాయిని మించి మాట్లాడితే గొప్పవాడిని అవుతానని అనుకుంటే నీ మూర్ఖత్వమే అవుతుందన్నారు. విమర్శలు చేసే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకొని, ఆలోచించి చేయాలని, నోటికి ఏది వస్తే అది మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న తిరుమలేష్ టిడిపిలోకి చేరి లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంటి పైన రాహుల్ గాంధీ ఫోటో పెట్టుకుని, తెలుగుదేశం పార్టీలో తిరుగుతున్నాడని, ఇంతకు ఆయన ఏ పార్టీ అనేది స్పష్టం చేయాలన్నారు. యోగివేమన యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ నుంచి రూ.5లక్షలు వసూలు చేశాడని, విద్యార్థి సంఘ నాయకునిగా నీ దగ్గరికి సమస్యలు చెప్పుకునేందుకు విద్యార్థులు వస్తే వారి దగ్గర సైతం వసూళ్లకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. ఇతని వెనుక ఎమ్మెల్యే మాధవి ఉండబట్టే తిరుమలేష్ ఇలా బరితెగిస్తున్నాడని మండిపడ్డారు. ఇలాగే మాట్లాడితే అతని అక్రమాలను సాక్ష్యాలతో సహా బయటపెడతామని హెచ్చరించారు. అనంతపురంలో లింగమయ్య హత్యపై తప్పుడు కేసులు నమోదు చేసిన ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు దమ్ముంటే ఖాకీ చొక్కా విప్పి రావాలన్నారు. వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త మాట్లాడుతూ టీఎన్ఎస్ఎఫ్ కాస్తా తెలుగునాడు సెటిల్‌మెంట్ ఫెడరేషన్‌గా మారిందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, పౌరసంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి. సరితతో కలిసి గురువారం వీసీ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 31 వ తేదీన ఏపీ పీజీ సెట్–2025 నోటిఫికేషన్ విడుదలైందన్నారు.

ఏప్రిల్ 2వ తేదీన ఆన్‌లైన్ దరఖాస్తులు ఆరంభమయ్యాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా ఈనెల 2 నుంచి మే 5వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. ఓసీ విద్యార్థులకు రూ. 850, బీసీలకు రూ. 750, ఎస్సీ, ఎస్టీలకు రూ. 650 వరకు రుసుం చెల్లించాలన్నారు. అపరాధ రుసుంతో మే 25 వరకు అప్లై చేసుకునే అవకాశం వుందన్నారు. విద్యార్థులు దరఖాస్తుల కోసం https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. విశ్వవిద్యాలయ సమాచారం కోసం www.yvu.edu.in ను సందర్శించాలని కోరారు.

'ఆపరేషన్ కగార్'ను నిలుపుదల చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దండకారణ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలుపుదల చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు, పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ గోపాల్, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఏపీ సిఎల్ పి వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ అలీ ఖాన్, డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ద్రాక్ష శ్రీనివాసులు, ముస్లిం మైనారిటీ ఎన్ఆర్‌సి, సీపీఎ కన్వీనర్ బాబు బాయ్ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం విశ్వేశ్వరయ్య భవన్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 'ఆపరేషన్ కగార్' బహుళ జాతి సంస్థల ప్రయోజనాలను కాపాడడానికి తప్ప మరి ఏ ఇతర ఫలితాన్ని సాధించదని అన్నారు. ఏప్రిల్ 20న కడప ఇంజనీర్స్ బిల్డింగ్‌లో ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తూ ఓ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు రాము, సిద్దిరామయ్య, మడగలం ప్రసాద్, నాజర్, సంపత్ కుమార్, ఫణి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంచడం తగదు

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడం తగదని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(పిఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రకాష్ నగర్ లోని బీసీ గృహంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ ఒక్కో సిలిండర్ పై రూ.50 పెంచడం దారుణం అన్నారు. ఇప్పటికే అన్ని రకాల ధరలతో సతమతమవుతున్న పేదలపై మరింత ఆర్థికభారం మోపడం సబబుకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో పేదవాడికి కష్టాలు తప్పడం లేదన్నారు. గ్యాస్ ధరలు పెంచుతూనే మరో వైపు గ్యాస్ సబ్సిడీకి మంగళం పాడే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇప్పటికైనా పెంచిన ధరను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు శివ, ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోమియోలో అన్ని రకాల చికిత్సలు



వికలాంగుల కాలనీలో వైద్య సేవలు అందిస్తున్న హోమియో వైద్యులు షాకీర్ హుసేన్

కమలాపురం : హోమియో వైద్యంలో అన్ని రకాల రోగాలకు వైద్య చికిత్సలు ఉన్నాయని ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యులు హుసేన్ ఆధ్వర్యంలో హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడ్రిక్ జయంతి, ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వికలాంగుల కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 55 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ క్రిస్టియన్ ఫెడ్రిక్ శామ్యూల్ హానిమన్ 1755 ఏప్రిల్ 10న జన్మించారన్నారు. 14 భాషల్లో ప్రావీణ్యం పొందిన ఈయన అల్లోపతి డాక్టర్ అయి కూడా ఆ వైద్య విధానం పట్ల విరక్తి చెంది 1796లో హోమియో పతి వైద్యా విధానంను కనుగొన్నారని గుర్తు చేశారు. ఈయన కనబెట్టిన హోమియో వైద్య విధానం ద్వారా అనేక రోగాలకు చికిత్సలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలకు హోమియోలో అత్యుత్తమ వైద్యం అందుతోందన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగులకు మంచి హోమియో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కమలాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళ, గురు, శని వారాలలో తాను అందుబాటులో ఉండి హోమియో వైద్యసేవలు అందిస్తానని ఆయన తెలిపారు. రోగులు ఈ విషయాన్ని గమనించి హోమియో వైద్య సేవలు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హోమియో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం చూతము రారండి

- ముక్తిరామలింగేశ్వరుడికి బ్రహ్మోత్సవ శోభ
- రేపు కల్యాణోత్సవం, 20న రథోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు పట్టణంలో వెలసిన సుప్రసిద్ధ క్షేత్రమే ముక్తి రామలింగేశ్వర ఆలయం. ఈ ఆలయంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుడు శివలింగాన్ని ప్రతిష్ఠించారని ప్రతీతి. మార్జాలరూపంలో గల రావణున్ని రాముడు తన బాణంతో వధించి ముక్తి ప్రసాదించడం వల్ల ఈ ప్రాంతానికి ముక్తి రామలింగేశ్వరమని పేరు వచ్చింది. రావణ వధ అనంతరం తనకు ఆపాదితమైన బ్రహ్మహత్యాదోషణ నివారణకు ఈ ప్రాంతంలో శివలింగం ప్రతిష్ఠ చేయ సంకల్పిస్తారు. రాముడు ఆంజనేయస్వామిని కాశీ నుంచి శివలింగం తీసుకురమ్మని ఆజ్ఞాపించడంతో ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపోవడంతో శ్రీరామచంద్రుడు 'సైకత లింగం' (ఇసుకతో చేసిన శివలింగం) ప్రతిష్ఠించారు. తర్వాత ఆంజనేయస్వామి వచ్చి తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పట్టుబట్టగా శ్రీరామచంద్రుడు ఆయన తెచ్చిన శివలింగాన్ని సైకత లింగానికి కొద్ది దూరంలో అభిముఖంగా ప్రతిష్ఠించారు. ఈ లింగాన్ని హనుమత్ లింగేశ్వరుడుగా పిలుస్తారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కన శ్రీ రాజరాజేశ్వరి దేవీ ఆలయంలో రాజరాజేశ్వరి దేవీ, చండీమాత, ఆది శంకరాచార్యుల వారు ప్రతిష్ఠించిన శ్రీ చక్రయంత్రం ఉంది. హనుమత్ లింగేశ్వరునికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేయడం విశేషం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు: ముక్తిరామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, రాత్రి 7గంటలకు ఎదురుకోళ్ల ఉత్సవం, శనివారం సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుని కల్యాణోత్సవం, 12 సాయంత్రం హంసవాహనం, 13న నెమలి, 14న పెద్దపులి, 15న రావణబ్రహ్మ, 16న వెండిపర్వతం, 17న శేషవాహనం, 18న నంది, 19న గజవాహనం, 20న రథోత్సవం మధ్యాహ్నం అన్నదానం, 21న వసంతోత్సవం, త్రిశూల స్నానం, అశ్వవాహనం, 22న సాయంత్రం ఊంజల్‌సేవ, పుష్పయాగం, ఏకాంతసేవ చేయనున్నారు. వీటితో పాటు రోజూ ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు, జపహోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. 21న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగనున్నాయి.

మూల్యాంకన సిబ్బందికి గౌరవ భృతి విడుదల చేయాలి



డీఈఓ, ఏసీ, సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి మూల్యాంకనం చేసిన సిబ్బందికి వీలైనంత వరకు గౌరవ భృతిని విడుదల చేసేందుకు కృషి చేయాలని డీఈఓ షేక్ షంషుద్దీన్‌కు ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే పదవ తరగతి పరీక్షలలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు తలెత్తినా చాలా చక్కగా పరీక్షలను నిర్వహించారని అలాగే మూల్యాంకన ప్రక్రియ నిర్వహణలో కూడా డీఈఓ కార్యాలయ సిబ్బంది చక్కగా సమన్వయంతో పూర్తి చేశారన్నారు. ఇందుకుగాను గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను, ఏసీ వెంకటేశ్వర్లను, సూపరింటెండెంట్ బాదుల్లాను ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డిలు తమ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో జిల్లాలోని వల్లూరు మండలం పరీక్షా కేంద్రంలో గణిత ప్రశ్నా పత్రం లీకేజ్ విషయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెన్షన్‌కు గురైన చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్విజిలేటర్ వెంకటరమణలను మానవత దృక్పథంతో సస్పెన్షన్ ఎత్తివేసి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

గండికోటకు యునెస్కో గుర్తింపునకు కృషి



మాట్లాడుతున్న భారత పురావస్తు సర్వేక్షణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జాన్విజ్ శర్మ

కడప కల్చరల్ : గండికోటకు యునెస్కో గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తామని భారత పురావస్తు సర్వేక్షణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జాన్విజ్‌శర్మ అన్నారు. గురువారం ఆ శాఖ కన్జర్వేషన్ డైరెక్టర్ ఏ భీమా, సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ గోపీనాథ్ బృందం గండికోటను యునెస్కోలో చేర్చడంపై సర్వే కోసం వెళుతూ కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఇంటాక్ చాప్టర్ కన్వీనర్, జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి వారితో మాట్లాడారు. సిద్ధవటం కోట, తొలిమలి తెలుగు శాసనాలు, చింతకుంట చిత్రాలకు రక్షణ కల్పించాలని ఆయన ఆర్కియాలజీ అధికారులకు విన్నవించారు. లంకమల అరుదైన శాసనాలు, ఆదిమానవుడు గీసిన చిత్రాలు, జిల్లాలోని బౌద్ధ ,జైన మాన్యుమెంట్ల రక్షణ గురించి వారి దృష్టికి తీసుకువెళ్లారు. జాన్విజ్ శర్మ స్పందిస్తూ జిల్లాలో ఇంటాక్ సభ్యత్వ సంఖ్యను పెంచాలని, కళాశాలలు, హైస్కూళ్లలో హెరిటేజ్ క్లబ్బులు, యంగ్ ఇంటాక్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర పురావస్తు శాఖ అధికారులను ఇంటాక్ సభ్యులు సత్కరించి జిల్లా పర్యాటకం వారసత్వంపై ప్రచురించిన పుస్తకాలను అందజేశారు.

ఏప్రిల్ నెలాఖరు వరకూ వడ్డీ రాయితీ వర్తింపు

కడప కార్పొరేషన్ : ఆస్తి పన్ను, ఖాళీ జాగాల పన్నులను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ పొందే అవకాశాన్ని ఏప్రిల్ 30వ తేది వరకూ పొడిగించినట్లు నగరపాలక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31 తేదిలోపు ఆస్తి పన్ను, ఖాళీ జాగాలపై ఉన్న పన్నులను ఒకేసారి చెల్లిస్తే 50 శాతం రాయితీ ఇచ్చారు. వరుస పండుగల నేపథ్యంలో చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోయినందున ఏప్రిల్ 30వ తేది వరకూ గడువు పొడిగించారన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్నులను సత్వరం చెల్లించాలని కోరారు.